క్లుప్తంగా

ఆకాశవాణిలో 'జంధ్యాల' ధారావాహిక ప్రసారం



శ్రీకాకుళం కల్చరల్: విశాఖ పట్నం ఆకాశవాణి రేడియోస్టే షన్‌లో రానున్న ఆదివారం నుంచి పట్టణానికి చెందిన రచయిత జంధ్యాల శరత్ బాబు ధారావాహికలను ప్రసారం చేయను న్నారు. ఈ మేరకు శరత్‌బాబు గురువారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని శ్రేష్టభారత్ కార్యక్రమాలలో భాగంగా సిక్కు సంప్రదాయ గురువుల ప్రసం గాలను 10 భాగాలుగా రికార్డు చేశారని, వీటిపై ఉపన్యాసాలు సాయంత్రం వేళల్లో ప్రసారమవుతాయని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డోల పాపినాయుడు సూచించారు. స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పేకల సుమబింధు ఆధ్వర్యంలో పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు, బాల్య వివాహాలపై గురువారం అవగాహన కల్పించారు. సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరరావు మరణం తీరనిలోటు



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రముఖ వాణిజ్య వేత్త, టీవీ సీరియల్స్ నిర్మాత శిమ్మ మల్లేశ్వరరావు మరణం తీరని లోటని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్ నివాసం వద్ద మల్లేశ్వరరావు అంత్యక్రియలకు హాజరై ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మల్లేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రైతు కుటుంబానికి చెందిన మల్లేశ్వరరావు బిడ్డల చదువుల కోసం శ్రీకాకుళం వచ్చి తొలి ద్విచక్ర వాహన, మొబైల్ డీలర్‌గా చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. సినీ, టీవీ రంగాల్లో ప్రవేశించి 'జీవిత బంధాలు'అనే సీరియల్‌ను దివంగత అక్కినేనితో పాటు తన చేతుల మీదుగా ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో కిల్లి కృపారాణి, ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.వి.స్వరూప్, రౌతు శంకరరావు, చిట్టి జనార్దనరావు, గొండు రఘు, పొన్నాడ రుషి, మండవల్లి రవి, ఎంఏ బేగ్, గురుగుబిల్లి లోకనాథం, మూకళ్ల తాతబాబు, కెల్ల కొండలరావు, రెడ్డి చిరంజీవరావు, కెల్ల చిన్ని, సుంకరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు



ఎమ్మెల్యేను అభినందిస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

జి.సిగడాం: ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును ఆయన కార్యాలయంలో జి.సిగడాం మండలం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక, ఉపాధ్యాయులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాలయంలో సాధిస్తున్న ఫలితాలు, అభివృద్ధిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.


మృతదేహం అప్పగింతలో జాప్యం

శ్రీకాకుళం: శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి (రిమ్స్) అధికారులు, ఉద్యోగులు జవాన్‌కు చుక్కలు చూపించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం అర్దలి గ్రామానికి చెందిన మద్దు బాబూరావు ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం సోమవారం మధ్యాహ్నం రిమ్స్‌లో చేర్పించారు. అదే రోజు అర్ధరాత్రి బాబూరావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుమారుడు, ఆర్మీ జవాన్ నానాజీ తాను విధులు నిర్వహిస్తున్న పాకిస్థాన్ సరిహద్దు నుంచి వెంటనే వచ్చారు. మంగళవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని మృతదేహం కోసం వెళ్లగా వివిధ కారణాలు చూపుతూ సాయంత్రం 4గంటల వరకు అప్పగించలేదు. అప్పుడు గట్టిగా నిలదీయంతో మృతదేహాన్ని అప్పగించారు. అనంతరం నానాజీ మాట్లాడుతూ తన తండ్రి మృతదేహం అప్పగించేందుకు మార్చురీ వద్ద పనిచేస్తున్న ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేశారని ఆవేదనతో తెలిపారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రతి నిత్యం పోరాడే యూనియన్ ఒక్క ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం శ్రీకాకుళం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. అంతా గందరగోళం



స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి మేనిఫెస్టో ఇదే..

కూటమి ప్రభుత్వం హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకం ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో తల్లులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో అందరిలో గందరగోళం నెలకొంది. ఎంతమంది పిల్లలను పంపిస్తే అంతమందికి కూడా ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందజేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం, పిల్లల సంఖ్య, ఇతర అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/జి.సిగడాం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



తల్లికి వందనం ద్వారా రూ.15వేలు ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. ఆ మాటను నిలబెట్టుకొని మాలాంటి కుటుంబాలకు అసరాగా నిలవాలి. నాకు ఇద్దరు పిల్లలున్నారు. పాప ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. బాబు ప్రైవేట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. రూ.30 వేలు వస్తాయని అనుకున్నాను. ప్రైవేట్ స్కూల్ నుంచి ఫీజు చెల్లించాలని ఫోన్లు చేస్తున్నారు.

– మహంతి నాగమణి, వల్లభరావుపేట, రణస్థలం మండలం

హామీ అమలు చేయాలి



ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ముగ్గురు పిలలున్నా తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఒక్కొక్కరికీ అందజేస్తామన్నారు. ప్రస్తుతం ఒక్కరే అన్న జీఓ విడుదల చేసినట్లు చెబుతున్నారు. నా ఇద్దరు పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి, 7వ తరగతి చదువుతున్నారు. వారి చదువుకు రూ.30 వేలు ఖర్చు చేయవచ్చన్న ఆశతో ఉన్నాను. ప్రస్తుతం ఒక్కరికే అనడంతో నా ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.

– దొంక రమాదేవి, చిలకపాలెం, ఎచ్చెర్ల మండలం

ఇద్దరు పిల్లలకు వర్తింపజేయాలి



ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం వర్తిస్తుందని ఆశగా ఎదురు చూశాను. నాకు ఇద్దరు అమ్మాయిలు. 10, 8వ తరగతి చదువున్నారు. రూ.30 వేలు వస్తుందని ఆశపడ్డాను. ప్రస్తుతం ఒక్కరికే తల్లికి వందనం ఇస్తామని అంటున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఇద్దరికీ తల్లికి వందనం అమలు చేయాలి.

– బొంతల భవాని, బొంతలకోడూరు, ఎచ్చెర్ల మండలం

అందరికీ ఇవ్వాలి



తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు చెప్పారు. దీంతో అందరికీ డబ్బులు వస్తాయని ఆశపడ్డాం. ఇప్పుడు ఇంటిలో ఒక్కరికే తల్లిపేరటి ఏడాది రూ.15 వేలు ఇస్తామని మాటమార్చారు.

– తేనెల నీలిమ, మురపాక, లావేరు మండలం

హామీ నెరవేర్చాలి



ఎందరు పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. హామీని అమలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 5, 2వ తరగతి చదువుతున్నారు. ఒక్కరికే ఇస్తున్నామని అంటున్నారు. దీంతో నిరాశ చెందాను.

– దాసరి లక్ష్మి, బొంతలకోడూరు, ఎచ్చెర్ల మండలం

జనాభా సమస్యలపై అవగాహన



శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు



శ్రీకాకుళం అర్బన్:స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రపంచంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభా నియంత్రణపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం అధిపతి టి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో 'ప్రపంచ జనాభా దినోత్సవం' సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, పేదరికం, మహిళల ఆరోగ్యం, హక్కులు తదితర జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసి కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు కె.ప్రభాకర్, లత, ఎస్.రుద్రమరాణి, పి.ఎస్.కనకదుర్గ, ఎల్.కృష్ణారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: తల్లిదండ్రులపై గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని పీఎస్ఎన్ఎం పాఠశాలలో ప్రపంచ జనాబా దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శి సిందూర, ట్రెజరర్ జోగి భారతి, జోనల్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, బి.దేవభూషణరావు, మెంటార్ నటుకుల మోహన్, క్లబ్ సభ్యులు టి.రాంగోపాల్, ఎస్.మణి, జి.చిన్నారావు, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. మగటపల్లి శాంతకుమారి కుట్టు శిక్షణా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో బి.చిన్మయరావు, పెంకి చైతన్యకుమార్, గొలివి రమణ, పి.సుజాత, శిక్షకురాలు సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డుతో పథకాల వర్తింపు



కళింగపట్నంలో భూసార పరీక్ష కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

గార: కౌలు రైతులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు పొందాలని డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్.వి.ఎస్.కె.ప్రసాదరావు అన్నారు. గురువారం కళింగపట్నం, వమరవల్లి, తోనంగి పంచాయతీల్లో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డు ద్వారా పంట రుణాలు, ఈ– పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట కొనుగోళ్లు, రాయితీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు వంటి పథకాలకు గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని వివరించారు. ఏఈవో జె.శ్రీదీప్తి వెద సాగు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరంభూసార పరీక్ష ఫలితాల కార్డులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా హీరాపంచమి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం హీరాపంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఒడిశా సంప్రదాయంలో భాగంగా లక్ష్మీదేవిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారిని పిలుపు చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీధర్‌దాస్ బాబాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గుజరాతిపేటలోనూ హీరాపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు సమయంలో భక్తులు అరటిపండ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా అందజేశారు.

డ్రైవింగ్ స్కూల్ మెటీరియల్ పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్లో 16వ బ్యాచ్ ట్రైనింగ్ తీసుకుంటున్న డ్రైవర్లకు శ్రీకాకుళం–1, 2 డిపో మేనేజర్‌లు మల్లికార్జునరావు, కె.ఎస్.ఆర్.శర్మలు గురువారం మెటీరియల్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ పాల్గొన్నారు.

జగన్మోహిని అవతారంలో జగన్నాథుడు



గుజరాతిపేటలో జగన్మోహిని అవతారంలో జగన్నాథుడు



ఇల్లీసుపురంలో జగన్మోహినిగా..



మొండేటివీధిలో జగన్మోహినిగా..



పాండ్రంగివీధిలో కాళీయమర్దనుడిగా..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు జగన్నాథ స్వామి ఆలయాల వద్ద రథయాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారు జగన్మోహినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అరసవల్లి: నగరంలో 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఏఎస్ఎన్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజినల్ ఆపరేషన్ ఈఈ సత్తారు బయ్యన్నాయుడు తెలిపారు. వరం కాలనీ హోమియోనగర్, విజయానగర్, ఏఎస్ఎన్ఎం కాలనీ, ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. తిలక్‌నగర్, ఇలిసిపురం, సానా వీధి, కొన్నావీధి, రాధాకృష్ణా నగర్, తుమ్మావీధి, భర్మాకాలనీ, రాయివీధి, కత్తెరవీధి ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత అమలు చేయనున్నట్లు ఈఈ ఎస్.బయ్యాన్నాయుడు తెలిపారు. సనపలవానిపేట, తమ్మినాయుడుపేట, ఇబ్రహింబాద్, కొత్తపేట, కొయ్యాం, దోమాం, మెట్టపేట, అఖింఖాన్‌పేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కామేశ్వరిదేవికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పాత శ్రీకాకుళం సంతోషిమాత ఆలయం వద్ద కామేశ్వరీదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



జి.సిగడాం: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లెంక గురువారం తెలిపారు. నరవ ప్రదీప్‌కుమార్ (నూజీవీడు), ఎల్ల హేమదీపిక (నూజీవీడు), ధర్మాన గ్రీష్మ(శ్రీకాకుళం), జాక మనోజ్‌కుమార్ (ఒంగోలు), డొప్ప భవాని (ఒంగోలు) ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వన్నిల యోగి (శ్రీకాకుళం) ఎంపికైనట్లు హెచ్ఎం నర్సింహమూర్తి తెలిపారు.

ప్రతిభ చాటిన కేజీబీవీ విద్యార్థులు



జె.షన్ముఖ ప్రియ



జి.చందన



పి.పావని

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుకున్న ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. జె.షన్ముఖ ప్రియ (నూజీవీడు), జి.చందన (ఒంగోలు), పి.పావని (శ్రీకాకుళం) సీట్లు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ సుధ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరుగురు ఎంపిక..

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మండలంలో అత్యధికంగా ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించారు. విద్యార్థులను గురువారం ప్రత్యేకంగా హెచ్ఎం కె.పార్థసారధి, ఉపాధ్యాయుడు సీపాన నరసింహమూర్తి అభినందించారు. ఎం.మణికంఠ, ఎల్.తిరుమలరావు, జి.ఢిల్లీశ్వరరావు నూజివీడు, బి.పల్లవి, ఎ.సాహితి, ఎచ్చెర్ల యమున శ్రీకాకుళం క్యాంపస్‌లకు ఎంపికయ్యారు.

ఫరీదుపేట నుంచి ఇద్దరు...

ఫరీదుపేట జెడ్పీ పాఠశాల నుంచి ఆర్‌జీయూకేటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ.అశ్విని, ఎస్.జలజాక్షిని హెచ్ఎం నారాయణ మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి అభినందన

సంతసీతారాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన కంప పూజిత శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌కు ఎంపికై ంది. విద్యార్థినిని పాఠశాలలో గురువారం హెచ్ఎం టి.జయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

కేశవరావుపేట నుంచి ముగ్గురు..

కేశవరావుపేట ఉన్నత పాఠశాల నుంచి ఆర్‌జీయూకేటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. జస్వంత్, జాహ్నవి, మౌనికను హెచ్ఎం సాయిరాం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు..



ఎచ్చెర్ల క్యాంపస్: మణికంఠను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ఎచ్చెర్ల క్యాంపస్: పూజితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆర్‌జీయూకేటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. హర్షిత్, జరగుళ్ల అంజిలిని హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు అభినందించారు.



బూరగాపు మనోజ్ఞ

గార: మండలంలోని మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామానికి చెందిన బూరగాపు మనోజ్ఞ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికై ంది. ఈమె స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో 571 మార్కులు సాధించింది. విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు దేవరాణి, పద్మావతి, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

శ్రీకాకుళం: నగరంలోని గుజరాతిపేట వరం హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు పి.ఇందిరామణి తెలిపారు. గురువారం వెలువడిన ఫలితాల్ల కురిటి ప్రేమ్‌కుమార్, వంజరాపు రమ్య, మాడుగుల జశ్వంత్, ఆశపు శ్యామ్‌కుమార్, ఇద్దిమి శశికుమార్, సూరు తనూషాకుమారి ఎంపికయ్యారని చెప్పారు.

చెరువు అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



నినాదాలు చేస్తున్న వేతనదారులు

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు పంచాయతీ పరిధిలోని మల్లిపెద్దివాని చెరువును అభివృద్ధి చేసేందుకు రూ.9 లక్షల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. సర్వే నంబర్ 39లో ఉన్న ఈ చెరువు విస్తీర్ణం 2.61 ఎకరాలు. 2023 ఆగస్టులో రూ.4.50 లక్షలతో పనులు చేశారు. 171 మంది వేతనదారులు పనిచేశారు. తరువాత గట్లు హద్దులు సరి చేసుకోవాలని స్థానిక రైతులకు ఉపాధి సిబ్బంది సూచించారు. దీంతో రైతులు సరి చేసుకున్నారు. రూ.4.50 లక్షలు పెండింగ్ పనులు మాత్రం చేపట్టటం లేదు. శ్రీకాకుళం పట్టణంలోని జెడ్పీ మీటింగ్ హాల్లో నిర్వహించిన మీ కోసంలో స్థానిక సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీష్, వేతనదారులు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధి పనులను తక్షణం ప్రారంభించాలని అధికారులు ఉపాధి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అయినా పనులు మాత్రం ప్రారంభించ లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, చెరువు ఆక్రమణపై కొందరి కళ్లు పడటం వంటి అంశాలు వల్ల పనులు ప్రారంభించటం కాలేదన్న విమర్శలు వస్తున్నాయి. పనులు ప్రారంభించకుంటే మరోసారి ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ అన్నారు. మరోపక్క పనులు జరక్కుండా కొందరు కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీ కోరుతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తిచేయాలన్నారు.

అజ్ఞాత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి



తీర ప్రాంత గ్రామాల్లో పోలీసుల పర్యటన

ఎచ్చెర్ల క్యాంపస్: తీర ప్రాంత గ్రామాల్లో నివసించే మత్స్యకారులు అజ్ఞాత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేషగిరి అన్నారు. సాగర్ కవచ్ కార్యక్రమంలో ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం గ్రామాల్లో గురువారం చైతన్య కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పోలీస్‌లు, మెరైన్ పోలీసులు మత్స్యకారులకు అవగాహన కల్పించారు.

పాడి పశువులకు టీకాలు

గార: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని అంపోలు కేంద్రం పశువైద్యాధికారి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం అంబటివానిపేట రైతుసేవా కేంద్రం పరిధిలోని గ్రామాల్లో పశువులకు బీక్యూ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

రణస్థలం: శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీలో జరిగిన అవకతవకలపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు దళిత సంఘాల జేఏసీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను కలిసి యూనివర్సిటీలోని సమస్యలపై వివరించారు. ఎస్సీ, ఎస్టీ, మహిళ, దివ్యాంగులు, మైనారిటీలకు ఉద్యోగాలు కల్పించడంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించాలన్నారు. విశ్వవిద్యాలయంలో అవనీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తక్షణమే విధుల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు క్లోపల్లి రాంగోపాల్, జేఏసీ నాయకులు దండాసి జాన్, దుర్గాసి గణేష్, టొంపల రమణ, గోవింద్, శ్యామ్, రాజు, నవీరి పద్మా తదితరులు ఉన్నారు.